
ప్రజాశక్తి
ఆదివారం 18 ఫిబ్రవరి 2024



ఓట్ల లెక్కింపు కేంద్రాలకు భవనాల పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం

లెండి ఇంజనీరింగ్ కళాశాల, సెంచూరియన్ యూనివర్సిటీలో ఓట్ల లెక్కింపు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి భవనాలను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి శనివారం పరిశీలించారు. ప్రతీ అంతస్తును, భవనాన్ని పరిశీలించారు. ఆయా గదుల వైశాల్యాన్ని, వసతులను తెలుసుకున్నారు. స్ట్రాంగ్ రూములు, ఓట్ల లెక్కింపు కేంద్రాలు, రిసెప్షన్ సెంటర్, డిస్ట్రిబ్యూషన్ సెంటర్, పార్కింగ్ ఏర్పాట్లకు అవసరమైన స్థలాలను, భవనాలను గుర్తించారు. ప్లాన్లను పరిశీలించారు. భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ఆయా కళాశాలల యాజమాన్య ప్రతినిధులతో చర్చించారు. ఈ పర్యటనలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, డిఆర్ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఓ ఎంవి సూర్యకళ, డెంకాడ తాహశీల్దార్ జె.రామారావు, విజయనగరం తాహశీల్దార్ పివి రత్నం, లెండీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రమణా రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిబాబు, సెంచూరియన్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి, డిప్యుటీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యోగుల ఆందోళన ఉధృతం



బొబ్బిలిలో జెఎసి ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పింఛనుదారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆర్థిక బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎపి జెఎసి ఆధ్వర్యంలో జరుగుతున్న ఆందోళన కార్యక్రమాలు శనివారం కొనసాగాయి. కలెక్టరేట్ ఎదుట జెఎసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపి ఎన్‌జిఒ రాష్ట్ర ఉపాధ్యక్షులు డివి రమణ, జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు సమస్యలు పరిష్కరించడంలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. వెంటనే ఉద్యోగులు సమస్యలు పరిష్కారం చేసి, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా లో కలెక్టరేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

బొబ్బిలి : జిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేసే వరకు పోరాటం చేస్తామని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘం జెఎసి నాయకులు కె.విజయగౌరి, జె.సి.రాజు, రౌతు రామమూర్తి, కె.జోగారావు, బి.రామారావు స్పష్టంచేశారు. ఎన్నికల హామీ మేరకు ఒపిఎస్ అమలు చేయాలని కోరుతూ ఎన్‌జిఒ హోం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ శనివారం ర్యాలీ చేపట్టారు. అనంతరం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి అధికారంలోకి వస్తే సిపిఎస్ రద్దు చేసి, ఒపిఎస్ అమలు చేస్తామని సిఎం జగన్ హామీ ఇచ్చి, అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో జెఎసి నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల : ఉద్యోగులకు పిఆర్‌సి అమలు చేసి, పెండింగ్ బకాయిలు వెంటనే విడుదల చేసి సిపి ఎస్ రద్దు చేయాలని జెఎసి ఛైర్మెన్ గణేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయ, పింఛన్‌దార్లు, కార్మిక జెఎసి నెల్లిమర్ల తాలూకా యూనిట్ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విశ్వనాథరాజు, ఎపిటిఎఫ్ జిల్లా ప్రెసిడెంట్ ఈశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పైడిరాజు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్, నెల్లిమర్ల ఎపిఎన్‌జిఒ సెక్రటరీ వై.రమణ, కోశాధికారి ధనుంజయ్, వైస్ ప్రెసిడెంట్లు నవీన్, నాగరాజు, జాయింట్ సెక్రటరీ శంకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జెఎసి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక తహశీల్దారు కార్యాలయం వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో జెఎసి ప్రతినిధులు లెంక అప్పలనాయుడు, మీసాల అప్పలనాయుడు, బి.సురేష్, జగదీశ్వరి, సత్య శ్రీనివాసరావు, అంపోలు సత్యనారాయణ, ఎస్ఎన్ ప్రసాద్, సత్యంతో పాటు పలు సంఘాల నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం: ఉద్యోగులు సమస్యలు వెంటనే ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉద్యోగులు సమ్మెకు సిద్ధంగా ఉండాలని భోగాపురం తాలూకా జాయింట్ యాక్షన్ కమిటీ ఛైర్మన్ కొమ్మూరు దుర్గారావు పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు మూడు మండలాల ఉద్యోగులు, పింఛనుదారులు ధర్నా చేపట్టారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ నెల 27న చలో విజయవాడ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల నాయకులు సూరి అప్పారావు, గణపతిరావు, ఉమాపతి, శరత్ కుమార్, సీతం రాజు, బంగారు బాబు, గురు భక్తులు పాల్గొన్నారు..


భోగాపురంలో ధర్నా చేస్తున్న జెఎసి నాయకులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు


పోలీసుల అదుపులో ఉన్న సిపిఎస్ ఉద్యోగులు

ఉద్యోగులపై నిర్బంధం

చలో విజయవాడకు వెళ్లనీయకుండా అరెస్టులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

సిపిఎస్ మాకొద్దు.. ఒపిఎస్ కావాలంటూ ఎపిసిపిఎస్ ఉద్యోగులు ఈనెల 18న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని పోలీసులు భగ్నం చేసేందుకు యత్నించారు. శనివారం సిపిఎస్ ఉద్యోగ సంఘాల నాయకుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి, చలో విజయవాడకు వెళ్లనీయకుండా గృహ నిర్బంధం, అరెస్టులు చేశారు. యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీరాములు, మీడియా ఇన్‌ఛార్జి గంటా శ్రీనివాస, మరి కొంతమంది ఉద్యోగుల ఇళ్లకు వెళ్లి నోటీసులు ఇచ్చి అరెస్టులు చేశారు.



మహిళలతో కరచాలనం చేస్తున్న నారా లోకేష్ : అభివాదం చేస్తున్న టిడిపి, జనసేన నేతలు

శంఖారావం సభలో నారా లోకేష్

వైసిపి పాలనలో..
ప్రజాధనం దోపిడీ

ప్రజాశక్తి - లక్కవరపుకోట, వేపాడ

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ భూములు, చెరువులు ఆక్రమించుకొని వేల కోట్లు ప్రజధనాన్ని దోపిడీ చేశారని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. శనివారం ఎస్.కోట నియోజకవర్గం సోంపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన శంఖారావం సభలో ఆయన ప్రసంగించారు. ఇసుక దందా, గంజాయి , నాసిరక మద్యం వ్యాపారాలతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఎద్దేవా చేశారు. ఎస్.కోట ఎమ్మెల్యే 25 ఎకరాల భూమిని ఆక్రమించుకొని ఇల్లు నిర్మించుకున్నారని ఆరోపించారు. పెందుర్తి నుండి ఎస్.కోట మీదుగా అరకు వెళ్లే ప్రధాన రహదారి ఆరు లైన్ల పనులు గాలికి వదిలేసారన్నారు. నాసిరకం మద్యంతో ప్రజల ఆరోగ్యాలను కొల్లగొడుతున్నారని అన్నారు. ఈ జిల్లాను అభివృద్ధి చేసింది టిడిపియేనని జిల్లాలో రోడ్లు, తాగు, సాగునీటి ప్రాజెక్టులు, నిరుపేదలకు సొంత ఇళ్లు కట్టింది తమ పార్టీయేనని తెలిపారు. ఎస్.కోటలో రూ.2వేల కోట్లతో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. పెందుర్తి-అరకు రోడ్డును 6 లైన్ల రోడ్డుగా చేస్తానని చెప్పిన జగన్ ఆ తరువాత పట్టించుకోలేదన్నారు. భీమసింగి సుగర్ ఫ్యాక్టరీని డబ్బులిచ్చి తెరిపిస్తానని చెప్పాడని, కానీ మనం ఇచ్చిన రూ.13 కోట్లు లాగేసుకుని షుగర్ ఫ్యాక్టరీని చంపేశాడని అన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన సూపర్ - 6 హామీలను ప్రజలకు తెలియజేసే విధంగా ప్రచారం చేస్తామని కార్యకర్తలతో ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం నియోజకవర్గంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమంలో ఉత్తమ పనితీరు కనబర్చిన 50 మందికి లోకేష్ చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలు అందజేశారు.

సభకు అధ్యక్షత వహించిన మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి మాట్లాడుతూ రాష్ట్రంలో ఒక రాక్షసుడు పాలిస్తున్నాడని, ఒక్క అవకాశం పేరుతో అందరూ మోసపోయారని అన్నారు. ఈ అరాచక ప్రభుత్వానికి ఓటుతో బుద్ధి చెప్పి, చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఐదేళ్లుగా రాష్ట్రంతోపాటు ఎస్.కోట నియోజకవర్గం అభివృద్ధిలో కుంటుపడిందన్నారు. ఇక్కడ ఎమ్మెల్యే ఇష్టారాజ్యంగా దోపిడీకి పాల్పడుతున్నారని, రెండు చెరువులను కబ్జా చేశారని అన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చాక ఎస్.కోటను విశాఖజిల్లాలో చేర్చాలని కోరారు.

జనసేన సమన్వయకర్త సత్యనారాయణ మాట్లాడుతూ విధ్వంసక పాలనలో దెబ్బతిన్న రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు జనసేన-టిడిపి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని, ఇందుకోసం ఇరుపార్టీల కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని కోరారు. సభలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, గాజువాక మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు , పార్టీ కార్యనిర్వహణ కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పలరాంప్రసాద్, జనసేన ఎస్.కోట సమన్వయకర్త ఒబ్బిన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన తాండాలకు రోడ్డుసౌకర్యం కల్పిస్తాం

తమ గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో అనారోగ్య సంభవించినపుడు ప్రజల ప్రాణాలు గాలిలో దీపంలా మారాయని మూలబొడ్డవరం, చిట్టంపాడు గ్రామస్తులు లోకేష్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. రోడ్డు మంజూరు చేస్తామని వైసిపి ప్రభుత్వం పలుమార్లు ప్రకటించినా ఎటువంటి చొరవా చూపలేదన్నారు. తమ గ్రామాలకు రోడ్డు కనెక్టివిటీ లేకపోవడంతో కొండపైకి వాహనాలు వెళ్లలేవని చెబుతూ ఇటీవల సంభవించిన ఘటనను వివరించారు. దీంతో లోకేష్ స్పందిస్తూ అధికారంలోకి రాగానే గిరిజన గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పిస్తామని, అత్యవసర సేవలకోసం ఫీడర్ అంబులెన్స్ లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

యువనేతకు వినతుల వెల్లువ

నియోజకవర్గంలో వివిధ వర్గాల ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యలను లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు. శంఖారావం సభకు ముందు వారు వినతిపత్రాలు సమర్పించారు. ఆదరణ పథకం కింద సైకిల్ తో పాటు రూ.10వేలు ఆర్థిక సాయం అందించాలని ఏపీ కల్లుగీత కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు. బ్యాంకు లింకేజీ లేకుండా 90శాతం సబ్సీడీతో రుణాలు మంజూరు చేయాలని, తెలంగాణలో మాదిరిగా నీరాకేఫ్‌లు ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. కమ్యూనిటీ భవనాల నిర్మాణంతో పాటు నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. నూతన వసతి గృహాలు నిర్మించాలని నియోజకవర్గ టిఎన్ఎస్ఎఫ్ నాయకులు కోరారు. కొత్తవలసలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జామిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. విఆర్ఎల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. జీవో 104 ప్రకారం ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు.


సభకు హాజరైన కార్యకర్తలు

గంజాయిని అరికట్టలేదేం?

మాజీ ఎమ్మెల్యే గీత

విజయనగరం కోట : జిల్లాలో గంజాయిని అరికట్టేందుకు ఎందుకు చర్యలు తీసుకోలేకపోతున్నారని ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామిని మాజీ ఎమ్మెల్యే మీసాల గీత ప్రశ్నించారు. తమ నాయకుడు లోకేష్ శంఖారావ సభలో చేసిన వ్యాఖ్యలపై ఎమ్మెల్యే వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గీత మాట్లాడారు. గంజాయి విషయంలో తెలుగుదేశం ఎమ్మెల్యేల పాత్ర ఉందంటున్న కోలగట్ల మరి ఎందుకు చర్యలు తీసుకోవం లేదని ప్రశ్నించరు. నగరంలో రోడ్లు అభివృద్ధి ఏదైనా జరిగిందంటే అది టిడిపి హయాంలోనే జరిగిందన్నారు. ఆనాడు 12 రోడ్లకు ప్రతిపాదన చేయగా ఎనిమిది రోడ్లు పూర్తి చేశామని, నాలుగు రోడ్లు ఇప్పటికీ పూర్తి చేయలేకపోతున్నారని తెలిపారు. ఇప్పుడు కొత్తగా డివైడింగ్ చేసి శంకుస్థాపనలు చేస్తున్నారని అన్నారు. సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

విలువలు కోల్పోయి ఆరోపణలు

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశకి-విజయనగరం టౌన్

టిడిపి నిర్వహించిన శంఖారావం సభలో తాను నగరంలో గంజాయి రవాణను ప్రోత్సహిస్తున్నట్లు నారా లోకేష్ చెప్పడాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఖండించారు. శనివారం కంటోన్మెంట్ వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనపై కొన్ని ఆరోపణలు చేయడం హాస్యాస్పదం, విచారకరమని అన్నారు. ఓట్లు కోసం ఇంత దిగజారి పోయి ఆరోపణలు చేయడం దారుణమని, గంజాయి వ్యాపారం చేస్తున్నామని చేసిన ఆరోపణలు నిజమైతే ప్రజలు తమకు ఓట్లు వేయొద్దని అన్నారు. టిడిపి అధికారంలో ఉన్నప్పుడు డ్రగ్స్ వ్యాపారం చేసిన మీరు తమపై ఆరోపణలు చేయడం మానుకోవాలని కోలగట్ల అన్నారు. గుంకలాం, సారిక, కొండకరకాం భూములు కొనుగోలులో అక్రమాలు చేసినట్లు చేసిన ఆరోపణలను రుజువు చెయ్యగలరా అని సవాల్ విసిరారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక, 63 ఏళ్ల వయసులో జల క్రీడ చేస్తే దానిపై వ్యంగ్యంగా మాట్లాడటం సరికాదన్నారు. కేంద్ర మంత్రి గా,రాష్ట్ర మంత్రిగా అశోక్‌గజపతిరాజు విజయనగరం పట్టణాన్ని ఏం అభివృద్ధి చేసారో చెప్పాలని డిమాండ్ చేశారు. నగరంలో తమ హయాంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రజలను ఓట్లు అడిగే దమ్ము టిడిపి నాయకులకు ఉందా అన్నారు. తెలుగుదేశం నాయకులకు ఉందా? అంటూ ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నగర అధ్యక్షులు ఎ.వేణు, మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, ఫ్లోర్ లీడర్ ఎస్ వి వి రాజేష్, డాక్టర్ విఎస్ ప్రసాద్, ఎంపిపి మామిడి అప్పలనాయుడు, పలువురు కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మిమ్స్ ఉద్యోగుల పోరాటానికి మద్దతు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణ మద్దతు ఉంటుందని ఎమ్మెల్సీ డాక్టర్ పి. సురేష్‌బాబు స్పష్టం చేశారు. శనివారం సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు గత 17 రోజులుగా సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరశన శిబిరాన్ని ఆయన సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. సురేష్ ఆధ్వర్యంలో సమస్యలతో కూడిన వినతి పత్రం ఎమ్మెల్సీకి అందజేశారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు డిఎ బకాయిలను యాజమాన్యం చెల్లించాలని, వేతన ఒప్పందం చేయాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ చేస్తున్న న్యాయమైన పోరాటానికి తన సంపూర్ణమైన మద్దతు ఉంటుందని తెలిపారు. మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు కోవిడ్ సమయంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించి, హాస్పిటల్ అభివృద్ధికి కృషి చేశారన్నారు. ఇలాంటి ఉద్యోగులకు మిమ్స్ యాజమాన్యం 7డిఏలు బకాయిలు ఉంచడం, జనవరి నెల జీతం వెయ్యకపోవడం అన్యాయమని దుయ్యబట్టారు. ఇప్పటికైనా మిమ్స్ యాజమాన్యం మొండి వైఖరి వీడి ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నాయకులు ధవళ లక్ష్మణ రావు, మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టి.వి. రమణ, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యుఎస్. రవి కుమార్, జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు, ఉద్యోగులు మిరప నారాయణ, కర్రోతు కామునాయుడు, మహంతి నాగ భూషణం, మధు, మూర్తి, రాంబాబు, బెల్లాన బంగారు నాయుడు, గౌరీ, వరలక్ష్మి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


నిరసన శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు

కోడ్ వచ్చేలోపే పనులు పూర్తిచేయాలి

కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ జారీ చేసే లోపు పోలింగ్ కేంద్రాల సన్నాహక పనులన్నీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత ఎన్నికల శిక్షణలు, నిర్వహణకు సంబంధించిన కార్యక్రమాలకే సమయం సరిపోతుందన్నారు. ఎన్నికల సన్నద్ధతపై నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం సమావేశం నిర్వహించారు. పోలింగ్ స్టేషన్లు, భవనాల మార్పులు ఏమైనా ఉంటే ఈ నెలాఖరులోగా ప్రతిపాదనలు పంపాలని తెలిపారు. మార్పులు ఉంటే సహేతుకమైన కారణాలను కూడా రాయాలన్నారు. ఈ విషయంలో రాజకీయ పక్షాల ప్రతినిధులతో కూడా చర్చించాలని సూచించారు. పోలింగ్ స్టేషన్ల మార్పులనే చేయగలం తప్ప కొత్తగా ఏర్పాటు వీలు కాదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్లలో కనీస అవసరాలను తనిఖీ చేయాలని, లేకుంటే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. ఆర్‌ఒలు చెక్ లిస్టు పెట్టుకొని అవసరమగు ఏర్పాట్లన్నిటినీ ముందే చూసుకోవాలన్నారు. సమావేశంలో జెసి కార్తీక్, డిఆర్‌ఒ అనిత పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

అంగన్వాడీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

విజయనగరం : జిల్లా పరిధిలో 4 అంగన్వాడీ కార్యకర్తలు, 24 అంగన్వాడీ హెల్పర్లు, 2 మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులు ఖాళీలను రూల్ అఫ్ రిజర్వేషన్ ప్రకారం భర్తీ చేసేందుకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు ఐసిడిఎస్ పిఒ శాంతకుమారి తెలిపారు. ఈనెల 24 సాయంత్రం 5గంటల్లోగా ఐసిడిఎస్ కార్యాలయంలో నేరుగా గాని, పోస్టు ద్వారా గాని అందజేయాలని తెలిపారు. గడువు తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించబడవని తెలిపారు. ఈ పోస్టులకు పదో తరగతి ఉత్తీర్ణతులైఉండి, తెలుగు ఒక సబ్జెక్టుగా ఉండాలని తెలిపారు. 2023 జులై 1 నాటికి 21ఏళ్ల నుంచి 35ఏళ్ల మధ్య వయసు ఉండాలని తెలిపారు.

19న టిడిపిలో చేరిక

విజయనగరం టౌన్ : ఈనెల 19న టిడిపిలో చేరనున్నట్లు వైసిపికి ఇటీవల రాజీనామా చేసిన పిల్లా విజయ్‌కుమార్, అవనాపు విజయ్ తెలిపారు. శనివారం అవనాపు నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వేలాదిమంది తో ర్యాలీగా వెళ్లి పూసపాటి అశోక్ గజపతిరాజు సమక్షంలో పార్టీలో చేరుతున్నామని తెలిపారు. టిడిపి బలోపేతానికి, టిడిపి జనసేన అధికారంలోకి వచ్చేందుకు కృషి చేస్తామని తెలిపారు. గుంకలాం, కొండకరకాం భూ వ్యవహారంలో సిఐడి విచారణకు డిమాండ్ చేశారు. సమావేశంలో రౌతు శ్రీనివాసరావు, రవి, కొన కిషోర్ ,చంటి,అలుగు.ఈశ్వరరావు పాల్గొన్నారు.

3 నుంచి బాలల సినీ ఉత్సవం

విజయనగరం కోట : విజయనగరంలో తొలిసారి బాలల సినీ ఉత్సవం (చిల్డ్రన్ ఫిల్మ్ ఫెస్టివల్) నిర్వహించనున్నట్లు ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నారాయణం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం ఉదయం తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఉత్సవ ఆహ్వాన ప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవం కోసం ఒక కమిటీ వేశారని, కమిటీకి తాను ఛైర్మన్‌గా, మండా రవి ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్‌గా, నారాయణ నిత్య, దవళ వెంకటరావు కో-ఛైర్మన్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. మార్చి 3 నుంచి 15వరకు కామెడీస్ ఆఫ్ చార్లీ చాప్లిన్ అనే పేరుతో బాలల సినీ ఉత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఉత్సవం రోటరీ క్లబ్ ఫోర్ట్, విజయనగరం ఫిలిం సొసైటీ, ఎన్‌సిఎస్ ఛారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించనున్నాయని తెలిపారు. కార్యక్రమంలో మండా రవి, రోటరీక్లబ్ ఫోర్ట్ అధ్యక్షులు డాక్టర్ సంతోష్, సెక్రటరీ అభిషేక్, రిక్కీ, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

బకాయిల కోసం 20న మున్సిపల్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ పంప్ హౌస్ కార్మికులకు నెలలు తరబడి జీతాలు చెల్లించుకుంటే ఎలా బతకాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు అధికారులను ప్రశ్నించారు. సమ్మె కాలపు జీతం, సంక్రాంతి కానుక, బకాయి జీతాలు, హెల్త్ అలవెన్స్ లు, పెండింగ్ జీవోల కోసం ఫిబ్రవరి 20న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్నట్లు ప్రకటించారు. శనివారం స్థానిక ఎల్ బి జి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్ర స్వామి ప్రతిరోజు వార్డు సందర్శనలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తున్నారని కానీ ప్రజలకు తాగునీరు అందిస్తూ, పారిశుధ్య నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్న మున్సిపల్ కార్మికుల సమస్యలను పట్టించుకోవడంలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో రాఘవ, తిరుమల, సతీష్ పాల్గొన్నారు.

కనువిప్పు కలిగేనా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అధికార, ప్రతిపక్షాలకు ఇప్పటికైనా కనువిప్పు కలిగేనా? రాష్ట్రానికి నమ్మకద్రోహం చేసిన బిజెపికి దూరంగా ఉండేనా? అన్న చర్చ గడిచిన నాలుగు రోజులుగా జిల్లా వ్యాప్తంగా సాగుతోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇటీవల టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ వెళ్లి బిజెపి పెద్దలతో మంతనాలు జరిపిన సంగతి తెలిసిందే. ఎన్నికల్లో పొత్తు కుదుర్చుకునేందుకే బాబు ఢిల్లీ వెళ్లారనే చర్చ సర్వత్రా సాగుతోంది. చంద్రబాబు మౌనం వహించడం ద్వారా జనం విమర్శల్ని అంగీకరించినట్లయింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి విజయనగరం జిల్లాకు చెందిన కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నేత వైరిచర్ల కిశోర్ చంద్రదేవ్ ఇటీవల టిడిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించిన విషయం విదితమే. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకపోవడంతో పాటు మతోన్మాద బీభత్స పాలనకు తెరలేపడం ద్వారా ఓటు బ్యాంకు సృష్టించుకోవడమే లక్ష్యంగా ఎన్‌డిఎ ప్రభుత్వం పనిచేస్తోందని, అటువంటి బిజెపితో టిడిపి చెలిమి చేయడం రాష్ట్రానికి ఏమాత్రమూ శ్రేయస్కరం కాదని, అందువల్లే తన సభ్యత్వాన్ని రద్దు చేసుకోదలచుకున్నానని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. దీన్నిబట్టి రాష్ట్రానికి బిజెపి ఎంత ద్రోహం చేసిందో వేరేగా చెప్పనక్కర్లేదు. దేశం, రాష్ట్రంతోపాటు ఉత్తరాంధ్ర, అందులోనూ ఉమ్మడి విజయనగరం జిల్లాకు బిజెపి పాలనలో చాలా అన్యాయమే జరిగింది. పదేళ్ల క్రితం నాటి గిరిజన వర్సిటీ హామీ కలగానే మిగిలిపోయింది. ఆరేళ్ల ఆలస్యంగా వర్సిటీని ఏర్పాటు చేసినప్పటికీ సొంత భవన సముదాన్ని సమకూర్చలేదు. తొమ్మిదేళ్ల తరువాత.. అంటే, నాలుగు నెలల క్రితం కేంద్ర విద్యాశాఖ మంత్రి భూమి పూజ చేసేందుకు వచ్చినందుకు అధికార వైసిపి నాయకులు, సిఎం వైఎస్ జగన్మోహనరెడ్డి మురిసిపోయారు. అంతే తప్ప, ఇన్నాళ్లూ జరిగిన ఆలస్యంపై ప్రశ్నించలేదు. పైగా కేంద్రం ప్రవేశపెట్టిన ప్రజా వ్యతిరేక విధానాలన్నీ మరే రాష్ట్రంలోనూ అమలు చేయనంతగా మన ప్రభుత్వం అమలు చేసింది. దీని ఫలితమే విద్యుత్తు ఛార్జీలు, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరుకుల ధరలు, చెత్తపన్ను వంటివి. ఇంకా ఆలోచిస్తే, నూతన విద్యా విధానం పేరిట స్కూళ్లను కలిపేసి, లక్షలాది మంది పేద విద్యార్థులను సర్కారు బడులకు దూరం చేసింది. మరోవైపు పాఠ్యాంశాల్లో శాస్త్రీయతను చూపించే డార్విన్ సిద్ధాంతం సహా అనేక పాఠాలను రద్దుచేసింది. వాటి స్థానంలో కర్మ సిద్ధాంతం, మనవాదం, మూఢనమ్మకాలను పెంచిపోషించే అంశాలను చేర్చింది.



రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఎలాగూ ఇవ్వలేదు. కనీసం వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీకి కూడా ముఖం చాటేసింది. దీంతో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు చాలా వెనుకబడిపోయాయి. ఇప్పటికీ ఏజెన్సీలో తగిన రహదారులు లేవు. బహుషా అందుకేనేమో మన్యం జిల్లాలో అక్షరాస్యతలో అట్టడుగు స్థానంలోకి వెళ్లింది. ఇప్పటికీ గిరిజన గ్రామాలకు రోడ్లు లేక రోగుల కోసం డోలిమోతలు తప్పడం లేదు. శృంగవరపుకోట మండలం మూలబొడ్డవర పంచాయతీ పరిధిలోని చిట్టెంపాడు గిరిజన గ్రామానికి చెందిన తల్లీబిడ్డ మరణం ఇందుకు మచ్చుతునకగా చెప్పుకోవచ్చు. ఉద్యోగాల ఆశచూపి వరుసగా రెండు సార్లు గద్దెనెక్కిన బిజెపి ప్రభుత్వం మాట నిలబెట్టుకోక పోవడంతో నిరుద్యోగం తాండవిస్తోంది. కూలి పనుల కోసం విదేశాలకు పోవాల్సిన దుస్థితీ దాపురించింది. నల్లధనం వెలికితీత పేరిట కరెన్సీ నోట్ల రద్దు వల్ల మన జిల్లా ఇప్పటికీ ఆర్థికంగా తేరుకోలేదు. అంతేకాదు, విద్య, వైద్యం వంటి కనీస అవసరాలు తీర్చేందుకు కూడా సహకరించని కేంద్ర ప్రభుత్వం.. సందు దొరికితే కులం, మతం, ప్రాంతీయ విభేదాలు సృష్టించడం ద్వారా రాజకీయ మనుగడ సాగించేందుకు బరితెగించింది. ఈ క్రమంలో రాజ్యాంగ మూలాలు దెబ్బతింటున్నాయి. సామాన్యులకు రక్షణ కొరవడింది. ఇటువంటి తరుణంలో ఇవే అంశాలను తప్పుగా ఎత్తిచూపుతూ కిశోర్ చంద్రదేవ్ టిడిపికి రాజీనామా చేయడం చర్చనీయాంశమే అయింది. ప్రజా దృక్కోణం గల మేధావులు కిశోర్ వైఖరిని సమర్థిస్తున్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

ఆర్థికాభివృద్ధికే చేతివృత్తులపై శిక్షణ

ప్రజాశక్తి - భోగాపురం

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసమే చేతి వృత్తుల పై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఆర్‌డిఎ పీడీ ఎ.కళ్యాణ్ చక్రవర్తి అన్నారు. మండలంలోని నందిగాంలో దేవాలయాల్లో ఉపయోగించే అగరబత్తి, ధూప్‌స్టిక్స్ తయారీపై భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, విజయనగరం మండలాలకు చెందిన మహిళా సంఘాల సభ్యులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నాబార్డ్ సకారంతో ఎల్ఇడిపి కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాబార్డ్ సహకారంతో మహిళలకు ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తయారు చేసిన వాటికి అవసరమైతే మార్కెటింగ్ సౌకర్యం కూడా కల్పిస్తామన్నారు. నాబార్డ్ డీజీఎం టి. అర్జునరావు మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకోవాలన్నారు. తమ తరపున అవసరమైన సహకారాన్ని అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గరే మురళి, ఏరియా కోఆర్డినేటర్ రాజకుమార్, డిపిఎం బంగారమ్మ, ఎపిఎం రమణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతి అందుకుంటున్న శరణ్య

ఇఇఎంటిలో శరణ్యకు మూడో ర్యాంకు

ప్రజాశక్తి - జామి

ఇఇఎంటిలో కుమరాం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థి ఆర్.శరణ్య రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు సాధించింది. ఈ మేరకు నిర్వాహకులు శరణ్యకు రూ.10 వేల నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. శరణ్యను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

అంతర్జాతీయ సదస్సుకు సబల కార్యదర్శి సరస్వతి



సరస్వతి

ప్రజాశక్తి-కొత్తవలస

కెన్యాలో ఈ నెల 18 నుంచి 22 వరకు ఆగ్రో ఎకాలజీ లీడర్‌షిప్ అకాడమీ ఆధ్వర్యాన జరిగే సదస్సుకు సబల సంస్థ కార్యదర్శి కె.సరస్వతి పయనమయ్యారు. పర్యావరణ పరిరక్షణ, ప్రకృతి వ్యవసాయం, చిరుధాన్యాల సాగులో చేసిన సేవలకు గుర్తింపుగా ఆమెకు ఆహ్వానం అందింది. మన దేశం నుంచి ఏడుగురికి ఆహ్వానం అందగా, అందులో సరస్వతి ఒకరు. అంతర్జాతీయ స్థాయిలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జరుగుతున్న మార్పులు, పాలసీలు, విధి విధానాలపై చర్చించనున్నట్లు ఆమె తెలిపారు.



రామును అభినందిస్తున్న నారా లోకేష్

టిఎన్ఎస్ఎఫ్ కో ఆర్డినేటర్‌కి అభినందన

ప్రజాశక్తి - నెల్లిమర్ల

అలుగోలు గ్రామానికి చెందిన టిఎన్ఎస్ఎఫ్ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ బొమ్మిడి రామును టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ శనివారం అభినందించారు. మన టిడిపి యాప్ వినియోగంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో మొదటి స్థానంలో నిలిచిన రాముని లోకేష్ అభినందించి ఉత్సాహ పరిచారు. కష్టపడే వారిని గుర్తించి తానే చూసుకుంటాను అని రానున్న రోజుల్లో పార్టీలో తగిన గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు

ప్రజాశక్తి-బొబ్బిలి

బాల్య వివాహాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఐసిడిఎస్ సిడిపిఒ జె.విజయలక్ష్మి తెలిపారు. బాల్య వివాహాలు, ర్యాగింగ్, ఆడపిల్లల భద్రతపై పాతబొబ్బిలి కూరాకులవీధిలో బుర్రకథ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, అలా చేస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. ఆడపిల్లలు, మహిళలను ర్యాగింగ్ చేసినా, లైంగికంగా వేధించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆడపిల్లలను చదివించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు చోడిగంజి రమేష్ నాయుడు, కె.పెదరాములు, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వైభవంగా వీరాంజనేయ జాతర

ప్రజాశక్తి- వేపాడ



పూజలు చేస్తున్న గొంప వెంకటరావు దంపతులు

మండలంలోని బానాది పంచాయతీ పరిధిలో ఉన్న ఎం.సింగవరంలో వీరాంజనేయ స్వామి జాతరను శనివారం ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్లుగా ఈ జాతరను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయుడి విగ్రహానికి టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఎంపిటిసి గొంప తులసి దంపతులు పూజలు చేశారు. అనంతరం భారీ అన్నసంతర్పణ కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఎడ్ల పరుగు పోటీలు నిర్వహించి, విజేతలకు నగదు బహుమతులు అందించారు.

ఘనంగా బంగారమ్మ తీర్థం

కొత్తవలస : మండలంలోని కాటకాపల్లి గ్రామంలో బంగారమ్మ తీర్థం శనివారం ఘనంగా జరిగింది. సర్పంచ్ పీతల కృష్ణ ఆధ్వర్యాన జాతర ఏర్పాట్లుచేశారు. మధ్యాహ్నం రెండు గంటల నుంచి మేళతాళాలతో అమ్మవారి ఇంటి వద్ద నుంచి ఆలయం వరకు ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని వెళ్లారు.

హోరాహోరీగా గుర్రపు పోటీలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని జాకేరులో జాతర సందర్భంగా శనివారం నిర్వహించిన గుర్రపు పోటీలు హోరాహోరీగా సాగాయి. పోటీలో 11 గుర్రాలు పాల్గొన్నాయి. విజేతలకు డిసిసిబి ఛైర్మన్ వి.వి.చినరామనాయుడు, గ్రామ నాయకులు బుద్ధ అప్పలనాయుడు నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి టివి రమణ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - భోగాపురం

అక్రమంగా మద్యం సీసాలు తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పట్టుకొని శనివారం అరెస్ట్ చేశారు. మండలంలోని రాజాపులోవ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా మద్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో సిఐ కె.సురేష్ సిబ్బందితో వెళ్లి దాడి చేసి పట్టుకున్నారు. ఇద్దరు వ్యక్తుల నుంచి 30 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. గుడివాడ గ్రామానికి చెందిన బోయ నర్సయ్యమ్మ, డెంకాడ మండలం మోదవలస గ్రామానికి చెందిన ఎర్నేటి గోవిందులను అరెస్ట్ చేసినట్లు ఆయన తెలిపారు.

వైసిపికి మరో షాక్

అధికార పార్టీలో ఇమడలేక పోతున్నామని నేతల ఆవేదన • త్వరలో జనసేనలో చేరనున్నట్టు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన సాలూరు నియోజక వర్గ ఇన్‌ఛార్జి రామకృష్ణ

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో అధికార పార్టీకి ఊహించని దెబ్బ తగిలింది. సుమారు 15 గ్రామాలకు చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు వైసిపికి గుడ్ బై చెప్పాలని నిర్ణయించారు. అధికార పార్టీలో ఇమడలేక పోతున్నామని ఆ పార్టీ నాయకులు ఆత్మీయ సమావేశంలో ఆవేదన వ్యక్తంచేశారు. త్వరలోనే వారంతా జనసేనలో చేరబోతున్నట్టు ప్రకటించారు.

మండలంలోని జయతి సమీపంలో తోటలో శనివారం వైసిపికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు ఆత్మీయ సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపిటిసి చింత కాశీనాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ సర్పంచ్ చింత సీతమ్మ, మీసాలపేట మాజీ సర్పంచ్ లెంక నారాయణ, రాబంద మాజీ సర్పంచ్ రామారావు, కో-ఆపరేటివ్ డైరెక్టర్ మజ్జి అప్పలనాయుడు తదితర ముఖ్యులు ఉన్నారు. వీరితోపాటు వారి అనుచరులు, ప్రధాన కార్యకర్తలు సుమారు 150 మంది వరకు హాజరయ్యారు. జనసేన సాలూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి గేదెల రామకృష్ణ దీనికి నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా వారు అధికార పార్టీలో ఎదురవుతున్న అవమానాలపై ఆవేదన చెందారు. ప్రజాప్రతినిధులకు కనీస మర్యాద, మన్ననలు దక్కలేదని వాపోయారు. గ్రామాల్లో అభివృద్ధి ఎండమావిగా మారిందని, ప్రజలకు సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. తమ సేవలను వాడుకొని నిర్లక్ష్యం చేస్తున్నారని వాపోయారు. ఆత్మాభిమానం చంపుకొని పార్టీలో కొనసాగలేకపోతున్నామని, ఈ నేపథ్యంలోనే జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నామని స్పష్టం చేశారు. చేరిక తేదీని ఒకట్రెండు రోజుల్లోనే నిర్ణయించి, భారీ సంఖ్యలో గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలతో జనసేనలో చేరతామని వెల్లడించారు. జనసేన నేత గేదెల రామకృష్ణ మాట్లాడుతూ వీరి నిర్ణయాన్ని అభినందిస్తూ, తమ పార్టీలోకి సాదరంగా ఆహ్వానిస్తున్నానని అన్నారు.

దెబ్బ మీద దెబ్బ

ఇటీవలే పలు గ్రామాలకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు పెద్ద సంఖ్యలో టిడిపిలో చేరిన విషయం తెలిసిందే. తాజాగా, మరికొందరు వైసిపి నాయకులు ఆ పార్టీకి రాంరాం చెప్పి జనసేనలో చేరాలని నిర్ణయించడంతో అధికార పార్టీలో కలవరం మొదలైంది. దెబ్బమీద దెబ్బతో ఆ పార్టీ నేతలు విలవిల్లాడుతున్నారు. ఈ కార్యక్రమంలో జనసైనికులు కూనిబిల్లి త్రినాథ్ ,పి.శేఖర్, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విశ్వవిద్యాలయం వర్కర్లకు

కనీస వేతనం అమలు చేయాలి



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

వ్యవసాయాన్ని దెబ్బతీసి, వ్యవసాయ విశ్వవిద్యాలయాలను అభివృద్ధి చేయకుండా నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు మార్చు కోవాలని, వ్యవసాయ విశ్వవిద్యాలయం కార్మికులకు చట్ట ప్రకారం హక్కులు అమలు చేయాలని కోరుతూ విజయనగరం ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కార్మికులు సమ్మె చేపట్టారు. తమకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు రెడ్డి శంకర్రావు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం వ్యవసాయాన్ని దెబ్బతీసే విధంగా చట్టాలు తెచ్చి వ్యవసాయ విశ్వ విద్యా లయాలను అభివృద్ధి చేయకుండా, వాటికి నిధులు మంజూరు చేయాకుండా అత్యంత దుర్మార్గంగా వ్యవహరిస్తున్నదని అన్నారు. వ్యవసాయానికి మద్దతు ధర చట్టం చేయాలని రైతులు పోరాడుతుంటే వారిపై నిర్బంధం పెట్టి హింసించడం సరైంది కాదన్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం వర్కర్స్‌కు చట్టపరమైన హక్కులు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సి ఐటియు నగర కార్యదర్శి బి. రమణ, ఐద్వా జిల్లా కార్యదర్శి పి. రమణమ్మ , వ్యవసాయ విశ్వవిద్యాలయం వర్కర్స్ యూనియన్ నాయకులు బుజ్జమ్మ, కొండమ్మ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలపై ప్రత్యేకాధికారి విచారణ

ప్రజాశక్తి - భోగాపురం



రికార్డులను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి సుధారాణి

మండలంలోని ముక్కాం జగనన్న కాలనీలో ఐరన్, సిమెంట్ పక్కదారి పట్టినట్లు వచ్చిన ఫిర్యాదు పై మండల ప్రత్యేకాధికారి ఎం. సుధారాణి శనివారం విచారణ చేపట్టారు. ఈ కాలనీలో అక్రమాలు జరిగినట్లు గతంలో ఫిర్యాదులు అందడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సచివాలయంలో లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు అందజేసిన సిమెంట్ ఐరన్ వివరాలను ఇచ్చింది, లేనిది అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొంతమంది లబ్ధిదారుల వద్ద స్టేట్మెంటును రికార్డ్ చేసుకున్నారు. ఆమె లబ్ధిదారులతో మాట్లాడుతూ చాలామంది లబ్ధిదారులు నేటికి ఇల్లు నిర్మాణాలు పూర్తి చేయలేదని, చాలామంది ప్రారంభించలేదని చెప్పారు. వీరు వెంటనే నిర్మాణం చేయకపోతే మంజూరైన ఇండ్లను ప్రభుత్వం రద్దు చేస్తుందని హెచ్చరించారు. విచారణపై పూర్తి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. గృహ నిర్మాణ శాఖ డిఇ మురళీమోహన్, ఎఇ కొల్లి రాజేష్, సచివాలయ కన్వీనర్ వాసుపల్లి రెయ్యుడు, ఇంజనీరింగ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వాలంటీర్లకు సత్కారం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-బొబ్బిలి

స్థానిక శ్రీకళాభారతి ఆడిటోరియంలో శనివారం పట్టణ వాలంటీర్లను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్ల సేవలను గుర్తించి ప్రభుత్వం పురస్కారాలతో సత్కరిస్తోందన్నారు. సంక్షేమ పథకాలు ఇంటింటికీ అందించేందుకు ప్రభుత్వం వాలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చినట్లు చెప్పారు. ఒకరికి సేవా వజ్ర, ఐదుగురికి సేవా రత్న, 310 మందికి సేవా మిత్ర పురస్కారాలను ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, కమిషనర్ ఎల్.రామలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

రామభద్రపురం : గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మండల పరిధిలోని నాయుడువలస పంచాయతీ కొండ పాలవలసలో రూ.4 లక్షలతో నిర్మించిన సిసి రహదారిని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాలవలస వచ్చినప్పుడు ఇక్కడి ప్రజల కోరిక మేరకు సిసి రహదారి మంజూరు చేసినట్లు తెలిపారు. సచివాలయ కన్వీనర్ లెంక శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు నడిమింటి సత్యం, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి-వేపాడ



అధికారులతో సమీక్షిస్తున్న మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం శనివారం సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా అధికారులను సమీక్షించారు. సంక్షేమ పథకాల అమలు, కార్యక్రమాలపై ఆరాతీశారు. 18 సచివాలయాల పరిధిలో అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తిచేయాలని ఆయన ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ ఉమ, ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వల్లంపూడిలో హౌసింగ్ డే

వల్లంపూడి గ్రామంలో హౌసింగ్ డే కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనరసింహం ఆధ్వర్యంలో నిర్వహించారు. అసంపూర్తిగా ఉన్న ఇళ్లను లబ్ధిదారులు పూర్తిచేసి, ప్రవేశాలకు సిద్ధంగా ఉండాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, హౌసింగ్ ఎఇ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఘనంగా ఫోర్టుసిటీ వార్షికోత్సవం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫోర్టు సిటీ పాఠశాల 12వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. రెండురోజుల పాటు జరుగుతున్న ఈ వార్షికోత్సవంలో విద్యార్థులంతా నృత్యాలు, నాటికలు, యోగా, పిరమిడ్స్, తైక్వాండో, కోలాటం మొదలగు అంశాలలో ప్రదర్శనలు ఇచ్చారు. దేశభక్తిని పెంపొందించే నృత్యాలతో పాటు వివిధ రాష్ట్రాల సంస్కృతి సాంప్రదాయాలకు సంబంధించిన నృత్యాలు ప్రదర్శించారు. వార్షికోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆ పాఠశాల ఛైర్మన్ కె.ఎ.పి.రాజు (శివ) మాట్లాడుతూ నృత్యాలు, నాటికలు చూస్తున్నంత సేపు ప్రపంచమంతా ఒకసారి తిరిగి వచ్చినట్లు అనిపిస్తోందని అన్నారు. తల్లిదండ్రుల గొప్ప తనాన్ని తెలియజేసేలా విద్యార్థులు నాటికల ప్రదర్శన ద్వారా చూపించారని విద్యార్థులను కొనియాడారు. 2022-2023 సంవత్స రానికి గాను అకడమిక్ టాపర్లకు, సెక్షన్ల ప్రకారం ఎక్కువ మార్కులు సాధించిన వారికి, శతశాతం హాజరు పొందిన విద్యార్థులకు బహుమతులను అందజేసారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ ఛైర్మన్ చంటి, ప్రిన్సిపల్ డాక్టర్ రీయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలమలు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పొడిబారిన కళ్ల పట్ల అప్రమత్తం కావాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన కొద్ది దానివల్ల దుష్ఫరిణామాలు కూడా ఎక్కువగా ఉంటున్నాయని రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి అన్నారు. శనివారం సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో నిర్వహించిన డ్రై ఐస్, ఎ కామన్ ప్రోబ్లమ్ ఇన్ దిస్ డిజిటల్ వరల్డ్ అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొడిబారిన కళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తం కావాలన్నారు. అనంతరం ఆప్టోమెట్రిస్ట్, పూర్వ విద్యార్థి కాశీభట్ల భాస్కర శ్రీలహరి మాట్లాడుతూ పొడిబారిన కళ్ల వల్ల కలిగే ప్రమాదాల గురించి వివరించారు. నేడు ఎక్కువ మంది విద్యార్థులు మొబైల్లు, కంప్యూటర్ వాడుతున్నారని దాని వల్ల కళ్లు వేగంగా అలసటకు గురికావడం, పొడిబారడం జరుగుతుందని చెప్పారు. అందువల్ల మొబైల్లు, కంప్యూటర్ వాడేటపుడు ప్రతి 20 నిమిషాలకు ఒకసారి కళ్లకు విశ్రాంతినివ్వాలన్నారు. 20 అడుగుల దూరంలో ఉన్న వస్తువులను లేదా ప్రకృతిని చూడాలన్నారు. అనంతరం ఐక్యూఎసి డీన్ ప్రొఫెసర్ పిఎస్వి రమణారావు ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి డీన్ ప్రొఫెసర్ ఎం.ఎల్.ఎన్.ఆచార్యులు సమన్వయకర్తగా వ్యవహరించారు. పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోపణలు నిరూపించగలరా?

కె.ఎ.నాయుడుకు ఎమ్మెల్యే బొత్స సవాల్

ప్రజాశక్తి-గజపతినగరం

గంట్యాడ శంఖారావం సభలో మాజీ ఎమ్మెల్యే కె.ఎ.నాయుడు తనపై చేసిన ఆరోపణలు నిరూపించగలరా? అని ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సవాల్ చేవారు. ఆరోపణలు నిరూపిస్తే తాను రాజకీయ సన్యాసం తీసుకుంటానని, లేకుంటే కె.ఎ.నాయుడు రాజకీయాల నుంచి తప్పుకుంటారా? అని ప్రశ్నించారు. స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. కె.ఎ.నాయుడు మాటలు దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగా ఉన్నాయని ఎద్దేవా చేశారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ అయిన వ్యక్తి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ ఆరోపణలు వెనక నారా లోకేష్ మెప్పు, ఎమ్మెల్యే టికెట్ కోసం తాపత్రయంగా కనిపిస్తోందన్నారు. బంగారమ్మపేట, భూదేవిపేట గ్రామాలకు రోడ్లు వేయకుండానే సొమ్ము స్వాహా చేసిన ఘనత కె.ఎ.నాయుడుకే దక్కుతుందన్నారు. ఈ విషయంలో అప్పటి అధికారులను బలిపశువులను చేశారని చెప్పారు. ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువత వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. దేవుపల్లిలో 33 ఎకరాలు బలవంతంగా నాగేశ్వరరావు అనే వ్యక్తి వద్ద లాక్కుని తన బినామీ పేరిట రిజిస్ట్రేషన్ చేయించారన్నారు.

సమావేశంలో జెడ్‌పిటిసి గార తౌడు, వైసిపి మండల అధ్యక్షులు బూడి వెంకటరావు, సర్పంచ్ బెల్లాన త్రినాథరావు, పిఎసిఎస్ అధ్యక్షులు కరుణ ఆదినారాయణ, ఉపసర్పంచ్ మండల సురేష్, జెసిఎస్ కన్వీనర్ కనకల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

బాధితుల చెంతకు సెల్‌ఫోన్లు

ప్రజాశక్తి-విజయనగరంకోట



బాధితులకు సెల్‌ఫోన్ అందజేస్తున్న సిఐ విజయకుమార్

జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న 30 మొబైల్స్‌ను పోలీసులు ట్రేస్ చేసి బాధితులకు అందజేశారు. విజయనగరం సోషల్ మీడియా సైబర్ సెల్ సిఐ టి.వి.విజయ కుమార్ శనివారం సైబర్‌క్రైమ్ పోలీసు స్టేషను వద్ద వాటిని బాధితులకు అందజేశారు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల గురించి ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే 30 ఫోన్లను ట్రేస్ చేసినట్లు సిఐ తెలిపారు. పోయిన మొబైల్స్‌పై https://www.ceir.gov.in ఆన్‌లైన్ ద్వారా, సైబర్ క్రైం పోలీసు స్టేషనులో నేరుగా ఫిర్యాదులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. తక్కువ వ్యవధిలోనే తిరిగి తమకు ఫోన్లను అప్పగించిన సైబర్ సెల్ పోలీసులకు, ఎస్‌పి దీపికకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సైబర్ సెల్ ఎస్ఐలు ప్రశాంత కుమార్, నజీమా బేగం, సైబర్ సెల్ కానిస్టేబుళ్లు వాసుదేవ్, శ్రీనివాసరావు, రాజేష్, నాగమణి, శిరీషా పాల్గొన్నారు.

భయంతోనే రాజధాని ఫైల్స్ సినిమా నిలుపుదల

ప్రజాశక్తి-బొబ్బిలి

భయంతోనే వైసిపి ప్రభుత్వం రాజధాని ఫైల్స్ సినిమాను నిలుపుదల చేసిందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబీనాయన ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. రాజధాని నిర్మాణంలో వైసిపి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని తెలిపారు. రాజధాని నిర్మాణం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సినిమా తీస్తే భయంతో ప్రభుత్వం అడ్డుకుంటోందని చెప్పారు. యాత్ర-2 సినిమాకు అనుమతులు ఇచ్చిన ప్రభుత్వం రాజధాని ఫైల్స్ అడ్డుకోవడం సరికాదని పేర్కొన్నారు.

బాబుతోనే రాష్ట్రానికి దశ దిశ

టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సంధ్యారాణి

ప్రజాశక్తి- మెంటాడ



కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు సంధ్యారాణి

టిడిపి అధినేత చంద్రబాబు ఆధ్వర్యంలోనే రాష్ట్రానికి దశ దిశని ప్రజలు గ్రహించారని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి అన్నారు. త్వరలోనే టిడిపి, జనసేన ప్రభుత్వ ఏర్పాటుతో వైసిపి విధ్వంసానికి, ఆరాచకానికి ముగింపు తథ్యమన్నారు. శనివారం మండలంలోని జక్కువ గ్రామంలో బాబు షూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల జగన్ ఏలుబడిలో రాష్ట్రం చిన్నాభిన్నం అయిందని ధ్వజమెత్తారు. అన్నివర్గాల ప్రజలు జగన్ బాధితులేనని చెప్పారు.. ఇంత సైకో సిఎంను ఇప్పటివరకూ ఎవరూ చూడలేదని దుయ్యబట్టారు. బటన్స్ నొక్కుతూ అదే అభివృద్ధి అని చెప్పుకుంటున్న జగన్ రెడ్డికి పాలన తెలీదని ఎద్దేవాచేశారు. రాష్ట్రాన్ని వైసిపి నేతలు లూటీ చేశారని దుమ్మెత్తిపోశారు. టిడిపి- జనసేన ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని భరోసా ఇచ్చారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను ఆమె ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు చలుమూరి వెంకటరావు, జి.అన్నవరం, ముసలి నాయుడు, రెడ్డి ఎర్నాయుడు, రెడ్డి ఆదినారాయణ, ఎ.సత్యం, రామలింగేశ్వరరావు, తాడ్డి గోవింద్, గుమ్మిడి సింహాచలం, రెడ్డి సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని వాహనం ఢీకొని..

గీత కార్మికుడు దుర్మరణం

ప్రజాశక్తి-బొండపల్లి

బొండపల్లిలో శనివారం ఉదయం గుర్తుతెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు కొల్లి బంగారప్పడు(59) మృతి చెందాడు. ఉదయాన్నే బంగారప్పడు తన వృత్తిలో భాగంగా తాటికల్లు గీసేందుకు వెళ్తున్నాడు. 26వ జాతీయ రహదారిపై గుర్తుతెలియని వాహనం ఆయన్ను ఢీకొంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బంగారప్పడును అటువైపు వెళ్తున్న వారు చూసి హుటాహుటిన విజయనగరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బంగారప్పడు మృతి చెందాడు. బంగారప్పడుకు భార్య, కుమారుడు ఉన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన గజపతినగరంలో శనివారం చోటు చేసుకుంది. పురిటిపెంట గ్రామానికి చెందిన సేనాపతి వెంకటరమణ (47) ద్విచక్ర వాహనంపై మెంటాడ నుంచి గజపతినగరం వైపుగా వెళ్తున్నాడు. అదుపుతప్పి పడిపోవడంతో గాయాలై తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు దగ్గరలో ఉన్న ఏరియా ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో ఆయన మరణించాడు.